క్లుప్తంగా

అర్బన్ బ్యాంక్ డైరెక్టర్‌కు అభినందన



సురేశ్‌ను అభినందిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

సిరిసిల్లటౌన్: అర్బన్‌బ్యాంకు డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన పట్టణానికి పత్తిపాక సురేశ్‌ను కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అభినందించారు. మంగళవారం కేంద్రమంత్రిని సురేశ్ ఢిల్లీలో కలిశారు. బీజేపీ మద్దతుతో అర్బన్‌బ్యాంకు డైరెక్టర్‌గా గెలిచిన సురేశ్‌ను బండి సంజయ్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గం కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: కేంద్ర హోంసహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను న్యూఢిల్లీలో కలిసినట్లు బీజేపీ సిరిసిల్ల అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి మంగళవారం తెలిపారు. కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా అభినందనలు తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ కృషి చేస్తారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్



సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులతో ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మంగళవారం హైదరాబాద్‌లో బిజీబిజీగా గడిపారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, మంజూరుపై దృష్టి సారించారు. ఇటీవల ఎన్నికైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, ఎంపీగా గెలిచిన చెలిమెల కిరణ్‌కుమార్‌రెడ్డిని మంగళవారం ఆయన అభినందించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకొని నియోజకవర్గ అభివృద్ధి, తదితర విషయాలపై చర్చించారు.

30 పడకల ఆస్పత్రి నిర్మించాలి

బోయినపల్లి: మండలకేంద్రంలో 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి గురజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. మండలంలోని 23 గ్రామాలకు మెరుగైన ఆస్పత్రి లేకపోవడం విచారకరమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేములవాడ, కరీంనగర్, సిరిసిల్ల లాంటి పట్టణాలకు వెళ్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం 30 పడకల ఆస్పత్రిని నిర్మించి ఇబ్బందులు తొలగించాలని ఈ సందర్భంగా శ్రీధర్ కోరారు.

ఆర్థికసాయం అందజేత

వేములవాడ: కోనాయపల్లి మాజీ సర్పంచ్ ఏరెల్లి నారాయణ కుమారుడు సాయికుమార్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆస్పత్రిలో తరలించారు. చికిత్స కోసం మన చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు మంగళవారం కోనాయపల్లిలో రూ.33 వేలను ఆర్థికసాయంగా అందజేసినట్లు ట్రస్ట్ ప్రతినిధి మోటూరి మధు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ తోటి మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవంతం చేయాలి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని విద్యావనరుల కేంద్రంలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వేములవాడ, వేములవాడ రూరల్ మండలశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లాలో ఈ నెల 16న ఏర్పాటు చేసిన విద్యా సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రవీందర్, నరేందర్, మహమూద్, రామచంద్రం, అంజయ్య, పంజాల వేంకటేశ్వర్లు, తిరుపతి, కృష్ణ, రామచంద్రం, శ్రీనివాస్, ఉమా బాలచందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

జాబ్‌మేళాపై అవగాహన

బోయినపల్లి: జిల్లాకేంద్రంలో ఈనెల 13న జరిగే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బోయినపల్లి పోలీస్ సిబ్బంది నిరుద్యోగ యువకులకు మంగళవారం అవగాహన కల్పించారు. పోలీసులు పాల్గొన్నారు.

'ఉపాధి' గ్రామసభలు

వీర్నపల్లి: మండలంలోని బాబాయి చెరువు తండా, వన్‌పల్లి, అడవిపదిర, ఎర్రగడ్డ తండా, మద్దిమల్ల తండా, భూక్యతండా గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ రమేశ్, డీఆర్‌పీ అనిల్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో 2023–24 సంవత్సరానికిగాను చేసిన పనులను తెలుసుకున్నారు. పంచాయితీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్ సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై పిడుగు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులో ఉన్న రాచర్ల జూనియర్ కాలేజీ సమీపంలోని తాటిచెట్టుపై మంగళవారం పిడుగు పడింది. దీంతో తాటిచెట్టుకు మంటలు అంటుకున్నాయి. చెట్టు సమీపంలో ఉంటున్న గంగిరెద్దుల కుటుంబీకులు ప్రాణాలతో బయటపడ్డారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

డ్రైనేజీల నిర్మాణమెప్పుడో?



తిప్పాపూర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు



- డ్రైనేజీలు లేక రోడ్లపైనే పారుతున్న మురుగు
- ఇబ్బందుల్లో విలీన గ్రామాల ప్రజలు
- పలుసార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాల్లో మురుగుకాలువలు లేక మురుగంతా రోడ్డునే పారుతూ దుర్వాసన వెదజల్లుతోంది. మురుగుకాలువలు నిర్మించాలని కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని మురుగుకాలువల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు..

పారిశుధ్య సిబ్బందిని నియమించాలి

విలీన గ్రామాల్లో మురుగుకాలువలు శుభ్రం లేక కంపుకొడుతున్నాయి. గతంలో మురుగుకాలవలు శుభ్రం చేయిస్తే సిబ్బంది సరిపడా ఇబ్బందిగా మారింది. నాంపల్లి, తిప్పాపూర్‌లో సరిపడా పారిశుధ్య సిబ్బందిని నియమించి మురుగుకాలువల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే మురుగు

దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం వాహనాల మీద వివిధ ప్రాంతాల ప్రజలు తరలివస్తుంటారు. కరీంనగర్, వరంగల్ ప్రాంతాలనుంచి వేములవాడకు కరీంనగర్ – సిరిసిల్ల ప్రధాన రహదారి నుంచి వస్తుంటారు. ఈ రహదారిలోని నాంపల్లి బస్‌షెల్టర్ వద్ద రోడ్డు గుంతలమయమైంది. ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపై పారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై గుంతల్లో మురుగునీరు నిలిచి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, రోడ్డుపై మురుగునీరు నిల్వకుండా రోడ్డు పక్కన డ్రైనేజీని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగుకాల్వలు నిర్మిస్తేనే..

తిప్పాపూర్ సాయిబాబా ఆలయం నుంచి మూలవాగు వరకు మురుగుకాలువ లేకపోవడంతో మురుగంతా ఇళ్ల మధ్యలో నిలుస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలబారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగుకాలువలు నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డుపైనే పారుతోంది



నాంపల్లిలోని కరీంనగర్ – సిరిసిల్ల ప్రధాన రహదారిలో మురుగునీరంతా రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని డ్రైనేజీని నిర్మించాలి.

– మేర్గు లక్ష్మణ్, నాంపల్లి

దుర్గంధం వస్తోంది



తిప్పాపూర్‌లో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీటిలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దీంతో నీరంతా నిల్వ ఉంటుంది. సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేయాలి.

– దుర్గరాజు, తిప్పాపూర్

మురుగుకాలువలు నిర్మించాలి



తిప్పాపూర్‌లో మురుగు కాలువలు సక్రమంగా లేక మురుగునీరంతా నిలుస్తోంది. రాత్రిపూట దోమలతో ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకొని త్వరగా మురుగుకాల్వలు నిర్మించాలి.

– మైలారం శ్రీనివాస్, తిప్పాపూర్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బోయినపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు



ఎల్లారెడ్డిపేట: గుండారంలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



కోనరావుపేట: ధర్మారంలో..

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు చిన్నారులను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాటలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత నోట్ బుక్స్, యూనిఫామ్స్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, నాయకులు లక్ష్మీరాజం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని అన్ని వార్డులు, వాడల్లో సర్కారు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్కారు విద్యపై అవగాహన కల్పించారు. స్థానిక కుసుమ రామయ్య పాఠశాల, చంద్రంపేట, బీవైనగర్, వెంకంపేట తదితర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనరావుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపాలని ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని కోనరావుపేట, బావుసాయి పేట, ధర్మారంలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, శ్రీధర్, కమలాకర్, నాగరాణి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, ప్రధానోపాధ్యాయులు గణాధి శ్రీనివాస్, బాయికాడి రామచంద్రం కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో బడిబాటలో ఉపాధ్యాయులు పాల్గొన్నా రు. రాచర్లగుండారంలో విద్యార్థులతో కలిసి బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రేమ్‌సా గర్, కవిత, సీఆర్పీ ఉపేందర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లిలో మంగళవారం అంగన్‌వాడీ బడిబాట, ప్రభుత్వ పాఠశాల బడిబాట నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ, బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ పరమేశ్వర్, పాఠశాల హెచ్ఎం రాజు నాయక్, అంగన్‌వాడీ టీచర్ లత, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, వెల్డర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 14 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు అందించాలన్నారు.

అధికారుల పరిశీలన

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామ శివారు ప్రఫుల్లారెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలోని ప్రమాదకరమైన మూలమలుపును ఎంపీపీ పడిగెల మానసతో కలిసి రోడ్డు రవాణాశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. మండెపల్లి ఎంపీటీసీ బుస్స స్వప్న లింగం సోమవారం కలెక్టర్‌కు ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో పలువురు మృతిచెందారని, శివారునుంచి గ్రామం వరకు, కేసీఆర్ నగర్ వరకు వీధి దీపాలతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో పర్యటించారని ఎంపీటీసీ స్వప్న పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మానస, కార్యదర్శి రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్‌బీ ఏఈ, సెస్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసరస్వతీ, శుభోదయ పాఠశాలల అనుమతులు రద్దు

తంగళ్లపలి: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ, శుభోదయ పాఠశాలల అనుమతులు రద్దు చేస్తూ డీఈవో రమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏబీవీపీ నాయకుడు మారవేణి రంజిత్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గతంలో ధర్నాలు చేపట్టి జిల్లా విద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. కాగా విచారణ చేపట్టిన జిల్లా అధికారులు వాస్తవమేనని నిర్ధారించి ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

ఉచిత విద్యుత్ అందించాలి

వేములవాడఅర్బన్: పట్టణంలోని నిరుపేదలకు ఉచిత విద్యుత్ అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. నిరుపేదలందరికీ ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి ద్వారా జీరో బిల్లు రావడం లేదని, 200 యూనిట్లలోపు ఉన్న వారికి జీరో బిల్ వస్తుందని, అది సర్వే పేరుతో కొంతమందికి వర్తించడం లేదన్నారు. నిరుపేదలకు ఆధార్ కార్డు ఉంటే విద్యుత్ మీటర్ అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు క్రాంతి, లక్ష్మణ్, దేవయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై రమాకాంత్


ఎల్లారెడ్డిపేట: ప్రజలు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించేవారిపై చర్యలు తప్పవని ఎస్సై రమాకాంత్ అన్నారు. మండలంలోని రాజన్నపేటకు చెందిన నలుగురు ప్రజలు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. మండలకేంద్రంలోని సాయిబాబా కమాన్ వద్ద గొడవ జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. రాజన్నపేటకు చెందిన నమిలికొండ బాలయ్య, నమిలికొండ రాజవ్వ అనే వారితో పాటు అదే గ్రామానికి చెందిన నమిలికొండ సర్వయ్య, నమిలికొండ నిర్మల ఇరువర్గాలు గొడవపడుతూ ఒకరికొకరు దాడులకు పాల్పడ్డారు. పోలీసులు వారించినా వినకుండా చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించారని హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బొప్పాపూర్‌లో విద్యుత్ కట్

- ఈదురుగాలులు, వర్షం లేకున్నా రోజంతా సరఫరాలో అంతరాయం
- అసహనం వ్యక్తంచేసిన గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో మంగళవారం రోజంతా విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో వర్షం, ఈదురు గాలులు లేనప్పటికీ సెస్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఉక్కపోతతో పాటు తాగునీటికి ఇబ్బందులు పడినట్లు వారు తెలిపారు. సెస్ అధికారులకు ఫోన్ చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఒక్క గ్రామంలోనే విద్యుత్ సరఫరాను నిలిపివేడంపై సెస్ ఎండీకి ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ



ముస్తాబాద్: మండల జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మంగళవారం పంపిణీ చేసినట్లు నోడల్ ఆఫీసర్ రాజిరెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండగా పుస్తకాలు అందించామన్నారు. బడిబాటలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థుల సంఖ్యను పెంచేలా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముస్తాబాద్‌లో ఆధునిక హంగులతో కార్పొరేట్ స్థాయిలో భవనం నిర్మించారన్నారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయులకు అన్యాయం



మాట్లాడుతున్న బీసీటీఏ బాధ్యులు

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రాథమిక విద్యాబోధనకు బీఈడీ చేసిన వారి సేవలు వినియోగించుకొని నేడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా డీఈడీ చేసిన వాళ్లే అర్హులనడం సహేతుకం కాదని బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. సిరిసిల్లలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధిక అర్హతలున్న వారికి పదోన్నతి ఇవ్వకపోవడం సరికాదన్నారు. అనేక ఏళ్ల తర్వాత చేపడుతున్న బదిలీలు, పదోన్నతులలో ఇలాంటి నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. వెంటనే నిబంధనలు సరిచేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బండారి మల్లేశం, జిల్లా అధ్యక్షుడు పులి రాంగోపాల్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సర్వీస్‌పర్సన్స్ నియమించాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శంకర్

సిరిసిల్లఎడ్యుకేషన్: పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత కాపాడే సర్వీస్ పర్సన్‌ను నియమించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ కోరారు. జిల్లా కేంద్రంలోని శివనగర్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, జిల్లా కోశాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

బోయినపల్లి: మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేయడం పట్ల మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నర్సింహాచారి, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీని కలిసిన మహేందర్‌రెడ్డి



ఎల్లారెడ్డిపేట: దుబాయిలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం దుబాయి ఎమరేట్స్ ఫోరం అధ్యక్షుడు, ఎల్లారెడ్డిపేట మండలం పదిరకు చెందిన కుంభాల మహేందర్ రెడ్డి అందెశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. దుబాయిలో గల్ఫ్‌కార్మికుల సమస్యలు, అక్కడి పరిస్థితులు, కంపెనీలలో యాజమానులు అనుసరిస్తున్న తీరుపై మహేందర్ రెడ్డి అందె శ్రీకి వివరించారు. దశాబ్ది వేడుకలు విజయవంతం కావడానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మరోసారి సెలవులో కార్యదర్శి

- మేజర్ పంచాయతీ అక్రమాలపై ఆరోపణలు
- ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకునేందుకు ముందుకురాని వైనం



ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ అక్రమాలపై కలెక్టర్, పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు. మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం చర్చనీయాంశమైంది. కొద్దిరోజుల క్రితమే ఇంటి పన్ను నకిలీ రసీదుల కలకలం, దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసలు మేజర్ పంచాయతీలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇష్టారాజ్యంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఇంటిపన్నుల వసూళ్లలో అక్రమాలు, డీజిల్, లైట్లు, మోటార్ల రిపేర్లు, పైప్‌లైన్ పనుల బిల్లుల్లో పారదర్శకత లోపించిందనే ఆరోపణలున్నాయి. బిల్ కలెక్టర్ నెలరోజులుగా సెలవులో ఉండి చార్జీ తీసుకోగా, ఇప్పుడు పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉండటం గమనార్హం. తహసీల్దార్ సురేశ్ ప్రత్యేకాధికారిగా కొనసాగుతుండగా, ఆయన పని ఒత్తిడిలో ఇటువైపు చూడటం లేదు. మరో కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించేందుకు చూస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు మొర పెట్టుకున్నా జిల్లా అధికారులు మిన్నకుండడం, ఇళ్ల నిర్మాణాల్లో చేతివాటంపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో ఎస్సీ కమ్యూనిటీ ఆధర్యంలో మంగళవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సుంకపాక శ్రీనివాస్, గంగరాం, శ్రీనివాస్, లక్ష్మణ్, అక్కనపల్లి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గృహజ్యోతికి దరఖాస్తుల వెల్లువ

ముస్తాబాద్: మండల పరిషత్‌లో గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో గృహజ్యోతి, రాయితీ సిలిండర్ రానివారు మరోసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ముగ్గురు ఆపరేటర్లు 22 గ్రామాల నుంచి ప్రజల దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గృహజ్యోతి విద్యుత్ సబ్సిడీ, రేషన్‌కార్డు, ఆధార్ జిరాక్స్ ప్రతులను అందజేయాలని సీనియర్ అసిస్టెంట్ సురేశ్ కోరారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం రేషన్ కార్డు, సిలిండర్ ఏజెన్సీ ఐడీ కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ అందించాలన్నారు.

నేడు 'చలో సెస్ కార్యాలయం'

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో విద్యుత్ సమస్యలపై బుధవారం గ్రామస్తులు చలో విద్యుత్ కార్యాలయం కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో లూజ్ లైన్ పోల్స్, మిడిల్ పోల్స్, హై, లో వోల్టేజీతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగితే నష్ట పరిహారం చెల్లించాలనే పలు డిమాండ్లతో చలో సెస్ కార్యాలయం చేపట్టారు. అలాగే 200 యూనిట్లలోపు జీరో బిల్లు అందరికీ వర్తించేలా చూడాలని కోరనున్నట్లు మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ తెలిపారు. గ్రామంలో 8 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, కేవలం ఒక్క హెల్పర్ మాత్రమే విధులు నిర్వహించడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. చలో సెస్ కా ర్యాలయం కార్యక్రమానికి రైతులు, వినియోగదారులు పెద్ద ఎత్తున తరలిరావాలని, సెస్ ఉన్నతాధికారులకు సమస్యలపై ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

ఎస్ఎంసీలను పునరుద్ధరించాలి

కోనరావుపేట: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఇదివరకు ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్య కమిటీలను పునరుద్ధరించాలని సుద్దాల మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఎర్రవెల్లి విజయ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇదివరకు ఉన్న ఎస్ఎంసీలను తొలగించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను వేశారన్నారు. పాఠశాలలతో ఎలాంటి సంబంధం లేని మహిళా సంఘాల ప్రతినిధులను ఇందులో చైర్మన్‌గా చేర్చడంతో పాఠశాల అభివృద్ధిపై వారు దృష్టి సారించలేరన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి పాఠశాల యాజమాన్య కమిటీలను పునరుద్ధరించాలని కోరారు.